శ్రీశైలంలో భక్తుల రద్దీ




నంద్యాల కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబికా మల్లికార్జునస్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులతో శ్రీశైల క్షేత్రం కిటకిటలాడింది. శ్రావణమాసం ఆదివారం సెలవు రోజు కావడంతో రాష్ట్రం నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది.

కేజీబీవీ టీచర్లకు శిక్షణ ప్రారంభం

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 9 జిల్లాల నుంచి కేజీబీవీలలో పని చేస్తున్న 120 మంది ఇంగ్లీష్ పీజీటీలకు ఆదివారం శిక్షణ ప్రారంభమైంది. కర్నూలు నగర శివారు పరిధిలోని రాఘవేంద్ర బీఈడీ కళాశాలలో ఈ నెల 7వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అదనపు పతక సంచాలకుడు డా.ప్రసన్నకుమార్ బోధనకు సంబంధించిన అంశాలను ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో కర్నూలు డీఈవో శామ్యూల్ పాల్, కర్నూలు, నంద్యాల జిల్లాల జీసీడీవోలు స్నేహలత, సువర్చల, ఆరుగురు రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు రెవెన్యూలో లంచావతారులు..!





నెలనెల ప్రభుత్వం ఇస్తున్న జీతాలు సరిపోవడం లేదో ఏమో. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులకు ధనదాహం తీరడంలేదు. ఉద్యోగంలో ఉన్నంత కాలం లంచాల రూపంలో ప్రజల్ని జలగల్లా పీల్చుకుతింటున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రమేష్ జూపాడుబంగ్లాకి చెందిన ఈశ్వరయ్య అనే వ్యక్తి కుటుంబీలకు చెందిన వ్యవసాయ పొలాన్ని తమ పేరిట ఆన్‌లైన్‌లో పేరు మార్చుకునేందుకు రూ.50వేలు డిమాండ్ చేసి ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ వ్యవహారంలో దొరికింది చిన్న చేప మాత్రమే? వాస్తవానికి ఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ కీలక ఉద్యోగి అవినీతి తిమింగలంలా అవతారమెత్తి లంచాల రూపంలో ప్రజల్ని పీల్చుకు తింటున్నాడు. ఈ కార్యాలయంలో పనిచేసే కొందరు సిబ్బంది కూడా ఆ అధికారి అవినీతి, అక్రమాలకు సహకరిస్తున్నట్లు విమర్శలున్నాయి. సదరు అధికారి ఏబీసీకి దొరికినట్లే.. దొరికి.. తప్పించుకోవడం రెవెన్యూ శాఖలో చర్చనీయాంశమవుతోంది.

- చిక్కినట్లే చిక్కి తప్పించుకున్న అక్రమార్కులు
- ముక్కుపిండి లంచాలు వసూళ్లు
- అడిగింది ఇవ్వకపోతే నెలల తరబడి ఫైళ్లు జాప్యం
- తహసీల్దార్లతోనూ కొరవడిన సమన్వయం
- ఇప్పుడు చిక్కింది.. చిన్న చేపనే..!
- కీలక అధికారిపై ఏసీబీ నిఘా
- ఏసీబీ దాడులతో చర్చనీయాంశమైన ఆర్డీవో కార్యాలయ దందా

ఆత్మకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆర్డీవో కార్యాలయంలో అవినీతి పాల్పడుతున్న ఏసీబీకి చిక్కింది చిన్న చేప అని, తిమింగలం ఇంకా గళంలో పడలేదని సర్వత్రా చర్చించుకుంటున్నారు. ఈకార్యాలయంలో పనిచేస్తున్న ఓ కీలక ఉద్యోగి అవినీతి తిమింగలంలా అవతారమెత్తి లంచాల రూపంలో ప్రజల్ని పీల్చుకు తింటున్నట్లు విమర్శలున్నాయి. కార్యాలయానికి వచ్చే ప్రతిఫైలును జాప్యం చేయడం ఆ అధికారికి పరిపాటిగా మారింది. సమస్యాత్మకమైన ఫైళ్ల విషయంలో సదరు అధికారి భారీగా ముడుపులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. ప్రత్యేకించి చుక్కల భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, జనన, మరణ ధృవీకరణ పత్రాల మంజూరు, ఆర్‌వోఆర్ రికార్డుల్లో మార్పులు, చేర్పులు, సమస్యలను పరిష్కరించాలంటే భారీగా ముడుపులు తీసుకుంటున్నట్లు ప్రచారం. రెవెన్యూ సిబ్బంది డిప్యుటేషన్ వ్యవహారంలో కూడా చేతివాటం ప్రదర్శించినట్లు సమాచారం. ఈఅధికారి అవినీతి బాగోతం ఇప్పటికే ప్రజాప్రతినిధుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. ఇటీవల ఓ ఎమ్మెల్యే సదరు అధికారిని ఘాటుగా మందలించినట్లు సమాచారం. మరో ఎమ్మెల్యే కూడా ఇక్కడినుంచి బదిలీపై వెళ్లమని సూచించినట్లు తెలిసింది. ఆ అధికారి ప్రవర్తనలో ఏమాత్రం మార్పు రాకపోవడం గమనార్హం.

ఆ అధికారి చెప్పడంతోనే..

ఏసీబీకి పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్ రమేష్ తన వాంగ్మూలంలో తాను పనిచేసే కార్యాలయంలోని ఓ కీలక అధికారి పేరు చెప్పినట్లు తెలిసింది. ఆ అధికారి చెప్పడంతో తాను లంచం తీసుకున్నట్లు ఏసీబీ అధికారుల ఎదుట వాపోయినట్లు ప్రచారం జరుగుతోంది. ఏసీబీ అధికారులు మాత్రం ఈ కేసులో నిందితుడు రమేష్‌ను ఒక్కడిని మాత్రమే చేర్చడంపై కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు బాధితుడు ఈశ్వరయ్య అర్జీ జాప్యానికి గల కారణాలను ఏసీబీ అధికారులు పరిగణలోకి తీసుకోకపోవడంపై ఆశ్చర్యానికి గురిచేస్తోంది. బాధితుడు ఈశ్వరయ్యనే కాదు.. చాలా మంది అర్జీదారులు కూడా కార్యాలయం చుట్టూ.. కాళ్లు అరిగేలా తిరి గినా.. వారి పనులు సకాలంలో జరగడం లేదన్న అపవాదులున్నాయి. అదే క్రమంలో ఈ కార్యాలయంలో పనిచేసే కొందరు సిబ్బంది కూడా సదరు అధికారి అవినీతి, అక్రమాలకు సహకరిస్తున్నట్లు విమర్శలు లేకపోలేదు. సదరు అధికారికి ఏబీసీకి దొరికినట్లే.. దొరికి.. తప్పించుకోవడం రెవెన్యూ శాఖలో చర్చనీయాంశమవుతోంది.

మిగతా 8లో..

మెరుగైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్



రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వైద్యులు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. శ్రీశైలంలోని పీహెచ్‌సీ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల వైద్యానికి అధిక నిధులు ఖర్చు చేస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. పీహెచ్‌సీలలో గర్భిణులకు అన్ని వసతులు కల్పించి డెలివరీలు సంఖ్య పెంచేలా చూడాలన్నారు. రోగులకు అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం కలెక్టర్ పీహెచ్‌సీలో నెలకు ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని, ప్రతిరోజు ఎంతమది పేషంట్లు ఆసుపత్రికి వస్తున్నారని, వచ్చిన పేషంట్లకు వైద్యులు అందుబాటులో ఉన్నారా? లేదా? ఎంత మంది వైద్యలు, సిబ్బంది పనిచేస్తున్నారు? అని అధికారిని అడిగి తెలుసుకున్నారు. అలాగే రోగులను కూడా వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

- శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామిని ఆదివారం ఉదయం కలెక్టర్ రాజకుమారి దర్శించుకున్నారు. ఆలయ ముఖ మండపం వద్ద అర్చకులు, ఆలయ ఈవో శ్రీనివాసరావు స్వాగతం పలికారు. కలెక్టర్ రాజకుమారి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకారలు, కుంకుమార్చనలు చేశారు. అనంతరం కలెక్టర్ రాజకుమారి శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించి పూజలు చేశారు.

అఖండ భారత్ సంకల్ప్ దివస్‌ను
ఘనంగా నిర్వహిద్దాం

చోరీ కేసుల్లో
నిందితుల అరెస్టు

7

నాలుగు నెలల్లో హైకోర్టు బెంచ్

- ఓర్వకల్లులో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు
- ఐదేళ్లు వైసీపీ విధ్వంసం చేస్తే.. చంద్రబాబు సరి చేస్తున్నారు
- అత్యున్నత పారిశ్రామిక పాలసీ కోసం రూపకల్పన
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



కర్నూలు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు నుంచి క్లియరెన్స్ రాగానే నాలుగు నెలల్లో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేస్తామని, ఆ దిశగా సీఎం చంద్రబాబు కసరత్తు చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. ఆదివారం కర్నూలులోని మౌర్యఇన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులు, సింగపూర్ పర్యటన్ సక్సెస్, రాయలసీమ ప్రాజెక్టులు, జిల్లాలో పారిశ్రామిక పెట్టుబడులు.. వంటి అంశాలను వివరించారు. అదే క్రమంలో గత ఐదేళ్లు రాష్ట్రాన్ని వైసీపీ ఏ రీతిన విధ్వంసం, వినాశనం చేసిందో ఘాటుగా స్పందించారు. జిల్లాకు చెందిన వ్యక్తిగా ఈ జిల్లాకు ఎక్కువ పెట్టుబడులు రాబట్టేందుకు మంత్రిగా తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఏడాదిలో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్‌లో రూ.10 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. దేశంలోనే దిగ్గజ సంస్థ రిలయన్స్ ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం తమ ప్రభుత్వం సాధించిన ఘనతగా వివరించారు. కర్నూలు విమానాశ్రయంలో రెండు పైలెట్ శిక్షణ సంస్థలు రాబోతున్నాయని, పైలెట్ శిక్షణ పూర్తి చేస్తే రూ.లక్షల్లో ఉద్యోగాలు వస్తాయన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ రూ.2,850 కోట్లులో అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం నీటి సౌకర్యం కల్పించే పైపులైన్ కూడా వేయకపోతే మన ప్రభుత్వం వచ్చాక 90 శాతం పూర్తి చేశామన్నారు. పశ్చిమ ప్రాంతంలో కూడా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే కరువు, వలసలు నివారించవచ్చని, ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. పత్తికొండ టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను తన హయాంలో పనులు మొదలు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. హంద్రీనీవా కాలువను 120 రోజుల్లో 3,850 క్యూసెక్కులకు విస్తరించి రికార్డు సృష్టించామని తెలిపారు.

మిగతా 7లో..

నీటి విడుదల ఆలస్యమైతే రైతులకు నష్టం

- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న బైరెడ్డి

నందికొట్కూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నీటి విడుదల ఆలస్యమైతే రైతులకు నష్టం కలుగుతుందని, 'నాగటూరు ఎత్తిపోతల పథకం' ద్వారా రైతులకు సాగు నీరు అందించకుండా కమిటీ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. నందికొట్కూరులోని తన స్వగృహంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాగటూరు ఎత్తిపోతల పథకం వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు, ఆయిల్, పైపులు తదితర వస్తువులు చోరీ అయ్యాయన్నారు. నూతనంగా ఏర్పడిన కమిటీ ఏమి చేస్తుందో తెలియడం లేదన్నారు. మెజార్టీ అభిప్రాయాలు తీసుకోకుండా కమిటీలు ఏర్పాటు కావడం బాధాకరమన్నారు. పటేల్ సెంటర్ వద్దకు వచ్చి తాళంచెవి ఇస్తే... నిధులను తీసుకొని పంటలకు సాగునీరు విడుదల చేస్తామన్నారు. దొరలు వారే.. దొంగలు వారే అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రెండేళ్ల క్రితం కర్నూలుకు మరమ్మతుల కోసం తీసుకెళ్లిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇంతవరకు తీసుకురాలేదన్నారు. పట్టించుకునే ఇరిగేషన్ అధికారులు ఎవ్వరూ లేరన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల నియోజకవర్గ పర్యటన సమయంలో ఎంపీ బైరెడ్డి శబరి ఎత్తిపోతల పథకాల మరమ్మతుల గురించి సీఎం దృష్టికి తీసుకెళ్లారన్నారు. టీడీపీ నాయకులు కౌన్సిలర్ చాంద్‌బాషా, అబ్దుల్ సుకూర్, అశోకరత్నం, పగిడ్యాల, నందికొట్కూరు, జూపాడుబంగ్లా మండలాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

'స్త్రీనిధి' చేయూత

- కర్నూలు జిల్లా మహిళల్లో ఆర్థిక వికాసం
- 19,575 మంది మహిళల స్వయం ఉపాధికి భరోసా
- రూ.195.62 కోట్లు రుణాలు మంజూరు లక్ష్యం
- ఇప్పటికే రూ.30.01 కోట్లు మంజూరు చేసిన అధికారులు



చేనేత మగ్గం ద్వారా ఉపాధి పొందుతున్న సి.లక్ష్మి

కర్నూలు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తున్నారు. ఆర్థిక క్రమశిక్షణ కారణంగా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు భారీగా రుణాలు మంజూరు చేస్తున్నాయి. మహిళలను లక్షాధికారులను చేయాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది. బ్యాంక్ లింకేజీ రుణాలు ఇస్తూనే.. మరో వైపు స్త్రీనిధి క్రెడిట్ ఫెడరేషన్ సంస్థ ద్వారా మహిళలకు తక్కువ వడ్డీలకు వివిధ స్వయం ఉపాధుల కోసం రుణాలను అందిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే మహిళలకు రుణాలు మంజూరు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కర్నూలు జిల్లావ్యాప్తంగా 19,575 మంది మహిళలకు రూ.195 కోట్లు రుణాలు అందించాలని లక్ష్యం కాగా.. ఇప్పటికే రూ.30.01 కోట్లు అందించారు.

కర్నూలు జిల్లాలో కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల పరిధిలో 32 వేలకు పైగా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) ఉన్నాయి. ఒక్కో సంఘంలో పది మంది మహిళలు సభ్యులుగా ఉంటూ నెలకు రూపాయి చొప్పున పొదుపు చేస్తున్నారు. 1994-95 మధ్యలో పొదుపు ఉద్యమానికి బీజం వేసిన సీఎం చంద్రబాబు మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం పలు పథకాలు అమలు చేశారు. జిల్లాలో సుమారుగా 3.25 లక్షల మంది పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. వివిధ స్వయం ఉపాధులకు రుణాలు తీసుకుంటూ క్రమం తప్పక చెల్లిస్తూ ఆర్థిక క్రమ శిక్షణ పాటిస్తున్నారు. కూటమి ప్రభుత్వం మహిళల ఆర్థిక వికాసం కోసం అమలు చేస్తున్న పథకాల్లో 'స్త్రీనిధి' ఒకటి. ఒక్కో ఎస్‌హెచ్‌జీకి రూ.5 లక్షల వరకు స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరు చేస్తారు. స్వయం సహాయక సంఘంలో సభ్యులుగా ఉన్న మహిళలు వ్యవసాయం, పొట్టేళ్లు, గేదెలు, కోళ్ల పెంపకంతో పాటు చిరు వ్యాపారాలు, చేతి వృత్తుల కోసం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు తీసుకునే అవకాశం కల్పించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 19,575 మంది మహిళలకు రూ.195.62 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటికే 1,005 ఎస్‌హెచ్‌జీల్లో 4,336 మంది మహిళలకు రూ.30.01 కోట్లు మంజూరు చేశామని స్త్రీనిధి ఏజీఎం తేజేశ్వరరావు తెలిపారు. బీమా సౌకర్యం కూడా ఉంది. రుణం తీసుకున్న మహిళలు ప్రమాదవశాత్తు మరణిస్తే తీసుకున్న రుణం చెల్లించాల్సిన అవసరం లేదు. స్త్రీనిధి గ్రామీణ మహిళల ఆర్థిక అభివృద్ధికి అండగా ఉందని పలువురు మహిళలు పేర్కొంటున్నారు.

96.85 శాతానికి పైగా రికవరీ

స్త్రీనిధి రుణాలు మంజూరులోనే కాదు.. రికవరీలోనూ ముందంజలో ఉన్నారు. 2024-25లో 19,501 మంది మహిళలకు రూ.127 కోట్లు స్త్రీనిధి రుణాలు మంజూరు చేశారు. సకాలంలో రూ.123.01 కోట్లు వసుళ్లు చేసి 96.85 శాతం రికవరీ లక్ష్యానికి చేరుకున్నారు. స్త్రీనిధి డబ్బు బ్యాంకులకు చెల్లించే క్రమంలో వీవోఏలు చేతివాటం ప్రదర్శించే అవకాశం లేకుండా ఈ ఏడాది నుంచి పేటీఎం చెల్లింపులు అమలులోకి తీసుకొచ్చారు.

మిగతా 7లో..

మిర్చి అధరహో!

- రైతుకు ఊహించని లాభాలు



రుద్రవరం మండలం ఆలమూరులో మిరపకాయలు కోస్తున్న కూలీలు

రుద్రవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పచ్చిమిర్చి 'అ'ధర'హో' అనిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని ధర పలుకుతోంది. దిగుబడులు భారీగా తగ్గడంతో మిర్చి ధర అమాంతంగా పెరిగింది. వ్యవసాయ బోరు బావుల కింద సాగు చేసిన మిరప రైతులకు పంట కాసులవర్షం కురిపిస్తోంది. తాజాగా రైతులు 50 కిలోల బస్తాను రూ.2,800 చొప్పున విక్రయిస్తున్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రుద్రవరం మండలంలోని ఆలమూరు, రుద్రవరం, నాగలవరం, ముకుందాపురం గ్రామాల్లో పచ్చిమిర్చి కోతలు ఊపందుకున్నాయి. మండల వ్యాప్తంగా దాదాపు 600 ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్నారు. పచ్చిమిర్చి ధర ఇంకా పెరగాల్సి ఉండగా వ్యాపారులు సిండికేట్ కావడంతో అది సాధ్యం కాలేదన్నారు. లేదంటే బస్తాపై మరో రూ.200 వచ్చేదని రైతులు పేర్కొంటున్నారు.

టమోటా కిలో రూ.50

- మళ్లీ పెరుగుతున్న ధర
- దిగుబడి తగ్గడంవల్లేనంటున్న వ్యాపారులు



కొలిమిగుండ్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో టమోటా ధర మళ్లీ పెరుగుతోంది. గత కొన్ని రోజులుగా రిటైల్ మార్కెట్లో పెరుగుతూ వస్తున్న టమోటా ధర ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో ఏకంగా రూ.50కి చేరింది. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి, ఏప్రిల్ వరకు టమోటా ధరలు భారీగా పడిపోయాయి. ఏకంగా కిలో రూ.2 పడిపోవడంతో టమోటా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం కిలో రూ.40 నుంచి రూ.50కు చేరుకున్నాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజలు అధికంగా వినియోగించే టమోటా ధరలు పెరగడంపై ఆయా వర్గాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిలకడలేమి ధరలతో ఇటు రైతులు, అటు వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాగా మార్కెట్లో దిగుబడి తగ్గడంతోనే మార్కెట్లో ధరలు పెరుగుతున్నారని, ధరలు మరింత పెరగవచ్చని వ్యాపారులు చెబుతున్నారు.

నేడు ఆత్మకూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఆత్మకూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టరేట్ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా ప్రజల నుంచి కలెక్టర్ రాజకుమారి నేరుగా అర్జీలను స్వీకరిస్తారు. ఉదయం 11:30 గంటలకు కలెక్టర్ పాల్గొంటారు. ఆత్మకూరు డివిజన్‌లోని ప్రజలు సమస్యలను దరఖాస్తుల రూపంలో సమర్పించాలని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. అదేవిధంగా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్, మున్సిపల్ కేంద్రాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కొనసాగుతుందని తెలిపారు. గతంలో సమర్పించిన అర్జీల పరిస్థితిని తెలుసుకునేందుకు టోల్ ఫ్రీ 1100 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అఖండ భారత్ సంకల్ప్ దివస్‌ను ఘనంగా నిర్వహిద్దాం

● వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి



మాట్లాడుతున్న టీసీ మద్దిలేటి

కర్నూలు కల్చరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈనెల 14న వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'అఖండ భారత్ సంకల్ప్ దివస్'ను ఘనంగా నిర్విహిద్దామని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి పిలుపునిచ్చారు. ఆదివారం ఆదిత్య నిలయం పాఠశాలలో వీహెచ్‌పీ జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన టీసీ మద్దిలేటి మాట్లాడుతూ 1947 ఆగస్టు 14న అర్ధరాత్రి దేశం రెండు ముక్కలుగా చీలిపోయిందని, ఎప్పటికైనా అఖండ భారతదేశాన్ని సాధించుకుంటామనే దృఢ సంకల్పంతో బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అఖండ భారత్ సంకల్ప్ దివస్ కార్యక్రమాలు ఏటా లక్షలాది మంది దేశభక్తులతో నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 14న సాయంత్రం 5:30 గంటలకు నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూకాలనీలోగల భరత మాత ఆలయంలో నిర్వహిస్తున్న అఖండ భారత్ సంకల్ప్ దివస్ వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావాలని కోరారు. వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతమయ్యేలా చూడాలని కోరారు. వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి వెంకట్రామయ్య సంకల్ప్ దివస్ కార్యక్రమాల కరపత్రాన్ని విడుదల చేశారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందరాజులు హైందవ శంఖారావం సభలో చిన్నజీయర్ స్వామీజీ ఆలయాల విముక్తికై చేయించిన ప్రతిజ్ఞను సభ్యులతో చేయించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవయ్య, స్వత్మానంద స్వామి, వీహెచ్‌పీ నాయకులు గోరంట్ల రమణ, సందడి మహేష్, రాంబాబు, ఈపూరి నాగరాజు, దుర్గావాహిని తదితరులు పాల్గొన్నారు.

'స్త్రీనిధి' చేయూత

5వ పేజీ (తరువాయి)

● ఎంబ్రాయిడర్ యంత్రం ద్వారా ఉపాధి



ఈమె పేరు దీపిక. ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామం. చేతి ద్వారా ఎంబ్రాయిడర్ వర్క్ పని చేసేది. వారంలో నెలలో రెండు మూడు బ్లౌజ్‌లకు మించి ఎంబ్రాయిడర్ వర్క్ చేసే అవకాశం ఉండేది కాదు. శాంతి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా చేరిన ఆమె స్త్రీనిధి నుంచి రూ.లక్ష రుణం తీసుకున్నారు. అధునాత ఎంబ్రాయిడర్ యంత్రం కొనుగోలు చేశారు. ఉన్న ఊళ్లోనే యంత్రం ద్వారా ఎంబ్రాయిడర్ వర్క్ చేస్తూ నెలకు రూ.15-20 వేలకు పైగా సంపాదిస్తున్నారు.

● విస్తర్ల ద్వారా జీవనోపాధి



విస్తర్ల యంత్రాలను చూపుతున్న ఆమె పేరు విశాలాక్షి. హాలహర్వి మండలం జె.హోసళ్లి స్వగ్రామం. వ్యవసాయమే జీవనాధారం. విస్తర్ల తయారీ నైపుణ్యం ఉన్నా ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. వారికి స్త్రీనిధి అండగా నిలిచింది. పారిజాతం స్వయం సహాయక సంఘం ద్వారా స్త్రీనిధి బ్యాంక్ నుంచి రూ.లక్ష రుణం తీసుకున్నారు. విస్తర్ల తయారీ యంత్రం కొనుగోలు చేసి ఉన్న ఊళ్లో.. సొంత ఇంట్లోనే స్వయం ఉపాధి పొందుతున్నారు.

మహిళలకు ఆర్థిక భరోసా



స్త్రీనిధి గ్రామీణ మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తుంది. ఈ ఏడాది 19,575 మందికి రూ.195 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 4,336 మందికి రూ.30 కోట్లు ఇచ్చాం. ఇంకా రూ.165 కోట్లు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. వివిధ జీవనోపాధులకు రుణాలు తీసుకోవచ్చు. అలాగే ఎస్‌హెచ్‌జీ సంఘాల్లో ఉన్న మహిళలు తమ పిల్లల చదువుల కోసం ఎన్టీఆర్ విద్య సంకల్పం కింద రుణాలు తీసుకోవచ్చు. బీమా సౌకర్యం ఉండడంతో రుణాలు తీసుకున్న మహిళలు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ రుణం మాఫీ అవుతుంది. నిధులు పక్కదారి పట్టేందుకు అవకాశం లేకుండా ఆన్‌లైన్‌లో రుణాలు మంజూరు చేస్తాం. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే మరింత రుణం తీసుకునే అవకాశంతో పాటు ఇతరులకు అవకాశం లభిస్తుంది. గతేడాది 96.85 శాతం రికవరీ సాధించాం.

- వైపీ రమణారెడ్డి, ప్రాజెక్ట్ డైరెక్టర్, డీఆర్‌డీఏ-వెలుగు, కర్నూలు

నాలుగు నెలల్లో హైకోర్టు బెంచ్

5వపేజీ తరువాయి

● ప్రభుత్వం మారడంతో భారీ నష్టం



దేశంలో గుజరాత్ రాష్ట్రం అగ్రస్థానంలో ఉండడానికి కారణం అక్కడ సుదీర్ఘంగా ఒకే ప్రభుత్వం కొనసాగడమేనని మంత్రి టీజీ భరత్ అన్నారు. 'రాష్ట్ర విభజన తరువాత 2014-19 మధ్య సీఎం చంద్రబాబు ఏపీ ఓ స్థాయికి తీసుకెళ్లాడు. టీడీపీ ప్రభుత్వం మళ్లీ వచ్చి ఉంటే ఏపీ అగ్రస్థానంలో ఉండేది.. దురదృష్టవశాత్తు వచ్చిన వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేయడంతో పెట్టుబడులు పెట్టేందుకు భయపడే పరిస్థితి ఏర్పడింది' అన్నారు. కూటమి ప్రభుత్వం మళ్లీ రావడంతో వైసీపీ చేసిన విధ్వంసాన్ని సీఎం చంద్రబాబు సరి చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నాడని తెలిపారు. ఉమ్మడి ఏపీలో 1999లో రెండవ పర్యాయం టీడీపీ ప్రభుత్వం రాకపోయి ఉంటే హైదరాబాద్‌కు హైటెక్ సిటీ, రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చేదా..? అని ప్రశ్నించారు. తమిళనాడు తరహాలో రాష్ట్రాభివృద్ధి కోసం ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. వైసీపీ తన విధానాలు మార్చుకోకపోతే రాబోయే ఎన్నికల్లో ఒక సీటుకే పరిమితం కావాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలో మంత్రులు నారా లోకేశ్, నారాయణలతో కలసి ఐదు రోజుల సింగపూర్ పర్యటన సూపర్ సక్సెస్ అయ్యిందని మంత్రి టీజీ భరత్ వివరించారు.

● ప్రజల్లో రెట్టింపు సంతృప్తి

ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని మంత్రి టీజీ భరత్ అన్నారు. 'ఏడాదిలోనే వృద్ధుల పింఛన్ రూ.4 వేలు, వికలాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాం. ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్లు పునఃప్రారంభం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను విజయవంతంగా అమలు చేశాం. ఈ నెల 7న చేనేతలకు ఉచిత విద్యుత్, 15 నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అమలు చేయబోతున్నాం..' అని అన్నారు. సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఏ ఇంటికి వెళ్లినా చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వంపై రెట్టింపు సంతృప్తి, ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారన్నారు. టిడ్కో గృహాలను కూడా పేదలకు త్వరలోనే అందజేస్తామని తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

● 5 తులాల బంగారం, 10 తులాల వెండి నగలు స్వాధీనం



నిందితులను, స్వాధీనం చేసుకున్న నగలను చూపిస్తున్న పోలీసులు

ప్యాపిలి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన వివిధ చోరీ కేసుల్లో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి బంగారు, వెండి నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆదివారం పట్టణంలోని పోలీసు సర్కిల్ కార్యాలయంలో నిందితులను హాజరుపరిచి సీఐ వెంకటరామిరెడ్డి కేసుల వివరాలు విలేకరులకు వెల్లడించారు. మండలంలోని హుసేనాపురం గ్రామంలో రెండు, మామిళ్లపల్లి గ్రామంలో ఒక చోరీ జరిగింది. ఈ ఏడాది జూన్, జూలై మాసాల్లో ఈ చోరీలకు సంబంధించి జలదుర్గం పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసులకు సంబంధించిన నిందితులను ఆదివారం మండలంలోని చిగురుమాను దగ్గర ఎస్‌ఐ నాగార్జున, పోలీసు సిబ్బంది అరెస్టు చేసినట్లు సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా తొండపాడుకు చెందిన మునగాల సుంకన్న, అదే జిల్లా యాడికి గ్రామానికి చెందిన జోగి రాజాను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 5 తులాల బంగారు, 10 తులాల వెండి నగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరూ మిక్సీలు, గ్యాస్ స్టవ్‌ల రిపేరీ పేరుతో గ్రామాల్లో తిరిగే వారని సీఐ తెలిపారు. ఇళ్లకు తాళాలు వేయడాన్ని గుర్తించి రాత్రిపూట చోరీలకు పాల్పడేవారని తెలిపారు. అరెస్టు చేసిన నిందితులను రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. అలాగే కేసులను ఛేదించి, నిందితులను అరెస్టు చేసిన జలదుర్గం ఎస్‌ఐ నాగార్జునను, సిబ్బంది నీలకంఠ, రమణ, మాధవ రెడ్డి, వెంకటరాజు, మాదన్న, నరసయ్య, మద్దిలేటి, అశోక్, హుసేన్ బాషా, మహబూబ్ బాషాను సీఐ అభినందించారు.

స్నేహబంధం ఎంతో ముఖ్యం

● కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ



స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న కేఎంసీ విద్యార్థులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మధ్య స్నేహభావం ఎంతో ముఖ్యమని జీవితంలో విద్యార్థి దశ మరుపురానిదని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ అన్నారు. ఆదివారం కర్నూలు మెడికల్ కాలేజీలో యూజీ హాస్పిటల్‌లో స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. జూనియర్, సీనియర్ విద్యార్థులు ఒకరికొకరు షేక్‌హ్యాండ్ ఇచ్చుకున్నారన్నారు. విద్యార్థులంతా ఒక్కటేనని స్నేహపూర్వకంగా కలిసిమెలిసి ఉండాలని ప్రిన్సిపాల్ కోరారు. వైద్య విద్యార్థులు సమాజానికి ఎంతో సేవ చేయాల్సి ఉందని, ఎంతో కష్టపడి కాలేజీ వచ్చారని, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ అలాగే యూజీ హాస్టల్ చీఫ్ వార్డెన్ డాక్టర్ నాగేశ్వర రావు ఆధ్వర్యంలో సీనియర్, జూనియర్లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో హాస్టల్ డిప్యూటీ వార్డెన్ డా.సోమశేఖర్, అసిస్టెంట్ వార్డెన్ డా.వెంకటేశ్వర్లు, పీఆర్వో బర్మా సురేష్ కుమార్ పాల్గొన్నారు.

వైన్ షాపులో వ్యక్తి మృతి

● మృతదేహాన్ని బయట పడేసిన నిర్వాహకులు



వైన్ షాపు పక్కన రామాంజనేయులు మృతదేహం

కోడుమూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కోడుమూరుకు చెందిన రామాంజనేయులు (38) అనే వ్యక్తి ఓ వైన్ షాపులో మద్యం తాగి మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. పట్టణంలోని శ్రీలక్ష్మీ వైన్స్ షాపు నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పర్మిమిట్ రూములను ఏర్పాటు చేశారు. రామాంజేయులు అనే వ్యక్తి వైన్ షాపులో మందు తీసుకొని అనధికారికంగా ఏర్పాటు చేసిన పర్మిమిట్ రూంలో మందు తాగాడు. మందు తాగిన కొద్ది సేపటికే కుప్పకూలాడు. రామాంజనేయులు మృతి చెందినట్లు నిర్ధారించుకున్న నిర్వాహకులు మృతదేహాన్ని తీసుకొచ్చి పక్కనే మరో షాపు ముందు పడేశారు. తమకు ఏమి సంబంధం లేనట్టు ఉండిపోయారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. తాగుడుకు బానిస కావడం వలన మృతుడికి పెళ్లి కాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

● నలుగురు స్నేహితులకు గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం



స్తంభాన్ని ఢీకొట్టిన కారు

ఆదోని రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆదోని మండలంలోని కపటి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు స్నేహితులు గాయపడగా.. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలివీ.. కపటి గ్రామానికి చెందిన చరణ్ స్వామి, గిరి, మంజు, మారుతి చిన్ననాటి స్నేహితులు. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా నలుగురు కలిసి కారులో ఆదోనికి బయల్దేరారు. తిరిగి 3గంటల సమయంలో గ్రామానికి బయల్దేరారు. గ్రామానికి సమీపంలో కారు విద్యుత్ పోల్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. విద్యుత్ పోల్ విరిగి పడడంతోపాటు కారులో ఉన్న మంజు, గిరికి తీవ్ర గాయాలయ్యాయి. చరణ్ స్వామి, మారుతి స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల సహాయంతో వారిని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సవాలకు రండి...

- కేంద్ర సహాయ మంత్రి కిషన్‌రెడ్డికి శ్రీమఠం ఆహ్వానం



కిషన్ రెడ్డికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న శ్రీమఠం సూపరింటెండెంట్ అనంతపురాణిక్

మంత్రాలయం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 354వ సప్తరాత్రోత్సవాలకు రావాలని కేంద్ర టూరిజం సహాయ మంత్రి కిషన్ రెడ్డికి శ్రీమఠం అధికారులు ఆహ్వానం పలికారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని కేంద్రమంత్రి నివాసంలో శ్రీమఠం సూపరింటెండెంట్ అనంత పురాణిక్ కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆహ్వాన పత్రికతో పాటు మఠం జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రితో పీఠాధిపతి ఫోన్‌లో మాట్లాడారు.

ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం స్థానిక ఏపీహెచ్‌ఎంఏ భవనంలో 2025-27 విద్యాసంవత్సరానికి నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా వై.నారాయణ, జనరల్ సెక్రటరీగా బీసీ హుశేన్, కోశాధికారిగా రమేష్ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక కార్యక్రమాన్ని రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రాష్ట్ర కౌన్సిలర్ జి.ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా అధ్యక్షుడు తెలిపారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల ప్రధానోపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆళ్లగడ్డలో దొంగతనం

● రూ. 4.5 లక్షలు, 4 తులాల బంగారం అపహరణ



ఇంటి తలుపులు పగుల గొట్టిన దొంగలు

ఆళ్లగడ్డ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొరుగుల బట్టి వీధిలో శనివారం రాత్రి చోరీ జరిగింది. వివరాలివీ.. కాలనీకి చెందిన బండల వ్యాపారం చేసుకొనే సంజీవ రాయుడు అనే వ్యక్తి తన ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి చర్చికి వెళ్లారు. అక్కడి నుంచి బంధువుల ఇంటికి వెళ్లారు. రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చారు. అప్పటికే ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంజీవరాయుడు ఇంట్లో బీరువాను రాడ్డుతో తొలగించి అందులో కూతురు పెళ్లి కోసం దాచుకున్న రూ. 4.50 లక్షల నగదు, నాలుగు తులాల బంగారం ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ యుగంధర్, ఎస్‌ఐ జయప్ప ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.



ఆత్మకూరు 'రెవెన్యూ'లో లంచావతారులు..!

(5వ పేజీ తరువాయి)

తలుపులు వేసి బేరసారాలు :

ఆర్డీవో కార్యాలయంలోని ఓ అధికారి గది తలుపులు వేసి బేరసారాలు సాగిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. అలాగే గతంలో ఆ అధికారి చాంబర్‌లో కొంత మంది సిబ్బంది పనిచేసేవారు. కానీ ప్రస్తుతం ఎవరూ అక్కడ ఎక్కడ లేకుండా స్వయంగా డీల్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేక్రమంలో తన కార్యాలయానికి వచ్చే ప్రజలు తన వద్దకు ఫోన్లు తీసుకురాకూడదని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. అందుకే ఆ అధికారి చాంబర్ తలుపులకు 'నాట్ అలోవుడ్ సెల్‌ఫోన్, సెల్‌ఫోన్లు లోపలికి తీసుకురాకూడదు' అని ఓ నోటీసు ఉంటుంది. సహజంగా అధికారుల వద్దకు జనం వెళ్లేటప్పుడు సెల్‌ఫోన్లను సైలెంట్‌లో ఉంచుకోవాల్సిన కనీస విచక్షణ అవసరం. అంతేతప్ప సెల్‌ఫోన్లు నాట్ అలోవుడ్ అని రాసి ఉండటాన్ని చూసి జనం అవాక్కవుతున్నారు.

అడ్డదారిలో ఉద్యోగం..?

ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారి అడ్డదారిలో ఉద్యోగాన్ని పొందినట్లు ఆత్మకూరులో విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే ఆ ఉద్యోగ నియామకం వివాదస్పదకరంగా ఉండటంతో దీపం ఉన్నప్పుడే ఇళ్లు చక్కదిద్దుకోవాలన్న చందాన ఆ అధికారి వసూళ్ల పర్వానికి తెరలేపి అందినకాడికి దోచుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాదు సదరు అధికారికి తన విధుల పట్ల సరైన అవగాహన లేదన్న విమర్శలు ఉన్నాయి. అలాగే కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను అర్థం చేసుకోకుండా గందరగోళంగా వ్యవహరిస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ అధికారి వ్యవహారంతో కార్యాలయ సిబ్బంది సైతం అల్లాడిపోతున్నారు.

ప్రతి ఫైలు విషయంలోనూ అంతే...

ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఆ అధికారికి డివిజన్ పరిధిలోని ఆయా మండలాల తహసీల్దార్లతోనూ సమన్వయం కొరవడినట్లు తెలుస్తోంది. ప్రతి ఫైలు విషయంలో డబ్బు లావాదేవీలను ప్రస్తావించడంతో సదరు అధికారితో తహసీల్దార్లు సయోధ్యతో ఉండటం లేదన్న విమర్శలు ఉన్నాయి. అందుకే కొన్ని అర్జీలను తహసీల్దార్లు సైతం మనకెందుకులే అన్నట్లు పక్కన పెడుతున్నట్లు తెలిసింది. దీంతో అంతిమంగా రెవెన్యూ శాఖకు సంబంధించి సమస్యలకు పరిష్కారం లభించకగా ప్రజలు ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి దాపరించింది. అవినీతి చీకట్లు అలుముకున్న ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయాన్ని ఉన్నతాధికారులు ఏవిధంగా ప్రక్షాళన చేస్తారో వేచిచూడాల్సిందే ఈ విషయంపై డీఆర్వో రామునాయక్‌ను వివరణ కోరగా తాను వీడియో కాన్ఫరెన్స్‌లో బీజీగా ఉన్నట్లు చెప్పడం గమనార్హం.

సిబ్బంది లేక అవస్థలు

- పనులు కాక ఇబ్బంది పడుతున్న ప్రజలు
- కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయ దుస్థితి



కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం

కొత్తపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. కొంతమంది సిబ్బంది డిప్యుటేషన్‌పై వెళ్లడంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్న బాబుమియా, సాయి కుమార్ రెడ్డిలు వేతనాలు కొత్తపల్లిలో తీసుకుంటూ డిప్యుటేషన్‌పై వెళ్లి ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో సేవలందిస్తున్నారు. అలాగే స్థానిక కార్యాలయంలో గత కొంతకాలంగా ఆర్ఐ, ఏఎస్‌వో పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. అంతేగాకుండా శివపురం, గుమ్మడా పురం, ఎర్రమఠం, కొత్తపల్లి గ్రామాల వీఆర్వో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొత్తపల్లి మండలం ముందే మారుమూల ప్రాంతం.. అందులోనూ గ్రామాలు కూడా తహసీల్దార్ కార్యాలయానికి దూరంగా ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చిన ప్రజలు అధికారులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కలెక్టర్ స్పందించి సిబ్బంది కొరత లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

- ఈ విషయంపై తహసీల్దార్ ఉమారాణిని వివరణ కోరగా... సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే నన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు: సీఐ



దుకాణంలో తనిఖీ చేస్తున్న సీఐ రాము

ఆత్మకూరురూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆత్మకూరు సీఐ రాము హెచ్చరించారు. ఆదివారం ఎస్పీ అధిరాజ్‌సింగ్ ఆదేశాల మేరకు ఆత్మకూరు పట్టణంలోని వెంగళరెడ్డి నగర్‌లో పోలీస్ సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కాలనీలోని రౌడీషీటర్లు, అనుమానితులు, నేర చరిత్ర గల వారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనుమానితుల వేలి ముద్రలను మొబైల్ సిస్టం చెక్ డివైజ్ ద్వారా పరిశీలించారు. ఇందులో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని 26 మోటర్ సైకిళ్లను, 12 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వెంగళరెడ్డి నగర్‌లో సైబర్ నేరాలు, పోక్సో చట్టం, బాల్యవివాహాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, రోడ్డు భద్రత, శక్తి యాప్ వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే డయల్ 112 ద్వారా పోలీస్ శాఖకు సమాచారం అందించాలని సీఐ ప్రజలకు సూచించారు.

6న కర్నూలులో ఆలోచనాపరుల వేదిక

- రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జా



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఈనెల 6న ఆలోచనాపరుల వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. ఆదివారం నంద్యాల రాయలసీమసాగునీటి సమితి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి కనికరించినా తుంగభద్ర జలాలను రాయలసీమ హక్కును రైతాంగం పొందలేకపోతుందన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు అందజేయడానికి అవసరమైన డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందన్నారు. వాస్తవ పరిస్థితులు ఏమిటో తెలుసుకొని ప్రాజెక్టుల నిర్వహణ, నిర్మాణం ప్రజల సంక్షేమం కోసమే చేపట్టేలాగా పాలకులపై ఒత్తిడి పెంచేందుకుగాను ఈనెల 5, 6 తేదీలలో ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాలతో పాటు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ , వెలుగోడు రిజర్వాయర్, గోరుకల్లు, అలగనూరు, సుంకేసుల బ్యారేజ్‌లను సందర్శించనున్నట్లు తెలిపారు. 6న మధ్యాహ్నం ఎస్టీయూ భవన్ కర్నూలులో ఆలోచనాపరుల వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ఏబీ వెంకటేశ్వరరావు ఐపీఎస్ , రైతు సేవా సంస్థ అధ్యక్షుడు అక్కినేని భవాని ప్రసాద్, సాగునీటి రంగ విశ్లేషకులు తుంగ లక్ష్మీనారాయణ, సామాజికవేత్త జొన్నలగడ్డ రామారావు, సీపీఐ నాయకుడు రామచంద్రయ్య, ప్రజాసంఘాల నాయకులు పాల్గొంటారన్నారు. రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు వైఎన్‌రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సీఎస్ఐ బిషప్‌గా రెవ. సంతోష్ ప్రసన్న రావు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాల డయాసిస్ బిషప్‌గా రెవరెండ్ కామనూరి సంతోష్ ప్రసన్న రావును ఎంపిక చేసినట్లు డయాసిస్ సెక్రటరీ స్టాన్లీ విలియమ్స్ తెలిపారు. ఈనెల 5వ తేదీ మంగళ వారం ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రెవరెండ్ కామనూరి సంతోష్ ప్రసన్న రావును చెన్నైలోని సినాడ్ అధికారులు ఎంపిక చేశారన్నారు. ప్రమాణస్వీకార మహోత్స వానికి సినాడు మోడరేటర్ రూబెన్ మార్క్, జనరల్‌సెక్రటరీ పెర్నాండెజ్ హాజరవుతారన్నారు.



నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

జూపాడుబంగ్లా, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం ఆత్మకూరులోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాజకుమారి పాల్గొంటారని, ప్రజలు ఆత్మకూరుకు వెళ్లవచ్చని ఆయన తెలిపారు.

విద్యార్థుల హక్కులను హరించడం సరికాదు

ఆత్మకూరు రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థుల తల్లిదండ్రులు మినహా ఇతరులు ఎవరిని అనుమతించరాదని విద్యాశాఖ ఉత్తర్వులు విద్యార్థుల హక్కులను హరించడమేనని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్, కన్వీనర్ సుజాత, సహాయ కార్యదర్శి హరవర్ధన్‌లు విమర్శించారు. ఆదివారం పట్టణంలోని బస్టాండ్ ఎదుట పాఠశాల ల్లోకి ఇతరుల అనుమనుతులను నిరాకరించే విద్యాశాఖ జీవో ప్రతులను ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి దహనం చేసి నిరసనను వ్యక్తం చేశారు. ఈ జీవో ఉత్తర్వులతో పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను తెలుసుకునే వీలుండదన్నారు. దీంతో విద్యార్థుల సమస్యలు బయటికి రాకుండా ప్రభుత్వం నోరు నొక్కే ప్రయత్నం చేస్తోందన్నారు. ఉత్తర్వు లను ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సాయి, ప్రశాంత్ ఉన్నారు.

పాములపాడులో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పాములపాడు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పాములపాడులో గ్రీన్ లైఫ్ పాలిక్లినిక్ డాక్టర్ షాకీరున్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం గ్రీన్‌పాలిక్ క్లినిక్ ఆవరణలో కర్నూలుకు చెందిన వైద్యులు అల్తాఫ్, షేక్ మహబూబ్, షాకీర్, రోఖియా పర్వీన్, షేక్ హఫీన్ అయూబ్ అన్సారీలు రోగులను పరీఓఇంచి నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

లిఫ్ట్ ద్వారా నీరు విడుదల చేయాలి

- సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి

నందికొట్కూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నాగటూరు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో నందికొట్కూరు, లక్ష్మాపురం రైతులతో కలిసి సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వర్షాభావంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. నీటి అవకాశం ఉన్నా కూడా కేవలం మరమ్మతుల కోసం దాదాపు రూ.15 లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించపోవడంతో బాధాకరమన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన నాయకులు ఇక్కడ పాలన సాగిస్తున్నా రైతులకు నీరు అందించా లన్న విషయాన్ని ఆలోచించకపోవడం శోచనీయమన్నారు. నాగటూరు ఎత్తిపోతల పథకం ఫేజ్-1, ఫేజ్-2 పథకాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లను, ఇతర మరమ్మతులను చేసి నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరుణ్ కుమార్, ఆది, శ్రీను, ఉస్మాన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

విద్యుత్ చార్జీల దోపిడీని అరికట్టాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం

ఆత్మకూరు రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల దోపిడీని అరికట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, పట్టణ పౌర సమాఖ్య నాయకులు రణధీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదానీ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించొద్దు అని మండలంలోని కరివేన కొత్త రామాపురం, నల్లకాలువ, బాపనంతాపురం, కురుకుంద గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిచి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ మిగులు ఉందని అంటూనే అదనపు సర్దుబాటు చార్జీల పేరిట ప్రజల నుంచి వసూలు చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. వైసీపీ ప్రభుత్వం పెంచిన చార్జీలను తగ్గించక పోగా అదనంగా చట్ట సవరణ చేసి ప్రజలపై మరింత భారాన్ని మోపడం తగదన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించ కూడదని ఈనెల 5న నల్లకాలువ గ్రామం నుంచి కరెంట్ ఆఫీస్ వరకు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న ఏసురత్నం

పంటలపై పందుల దాడి

- రైతులకు తీవ్ర నష్టం
- పందులను కట్టేసుకోవాలని గ్రామపెద్దల తీర్మానం

జూపాడుబంగ్లా, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జూపాడు బంగ్లా గ్రామ సమీ పంలో ఉన్న మొక్కజొన్న పంటలపై పందులు దాడి చేసి నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు నష్టపోతున్నారు. గ్రామపెద్దలు పందుల యజమానులను పిలి పించి పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. పందులను బయటికి వదిలేయడంతో రైతులు తీవ్ర నష్టపోతే ఎవరు బాధ్యత వహిస్తారని సమావేశంలో లేవనెత్తారు. రైతులకు పంట నష్టపరిహారం అందిస్తారాంటూ పందుల యజమానుల ను అడిగారు. ఎక్కడైనా కంచె ఏర్పాటు చేసుకుని పందు లను బంధించి పెంచుకోవాలని సూచించారు. పందులు ఎక్కువగా ఉన్న కారణంగా పంటలపై దాడులు చేస్తున్నాయని నాలుగురోజుల్లో అమ్మేసుకుంటామని, కొన్నింటిని పెట్టుకుని మేపుకుంటూ కట్టేసుకుంటామని పెద్దల సమక్షంలో హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సర్పంచ్ బాలయ్య, గ్రామపెద్దలు పెద్దన్న, సైఫుద్దీన్, సుధాకర్, రవికుమార్ యాదవ్, రైతులు పాల్గొన్నారు.



జూపాడుబంగ్లాలో మొక్కజొన్నను నాశనం చేస్తున్న పందులు

ఎండుతున్న పంటలు

- ఆందోళనలో రైతులు



ఎండుతున్న మొక్కజొన్న పంట

పాములపాడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత పది రోజుల నుంచి అడప దడప తేలికపాటి చినుకులే తప్ప చెప్పుకోదగ్గ భారీ వర్షాలు కురువక పోవడంతో రైతులు సాగుచేసిన మొక్కజొన్న, సోయాబీన్, పత్తి తదితర పంటలు ఎండుముఖం పట్టాయి. దీంతో రైతులు ఆందోళన చెందు తున్నారు. ఈ ఏడాది మే, జూన్ మాసంలో అధిక వర్షాలు కురవడంతో రైతులు దుక్కిదున్ని విత్తనాలు వేసి పంటలు సాగుచేశారు. మండలంలోని చెలమిల్ల, లింగాల, ఇస్కాల, రుద్రవరం, జూటూరు. క్రిష్ణరావుపేట, పాముల పాడు, ఎర్రగూడూరు, బానుముక్కల మట్టకందాల తదితర గ్రామాలలో దాదాపు 7వేల హెక్టార్లలో మొక్కజొన్న, 2వేల హెక్టార్లలో పత్తి, సోయాబీన్ పంటలను సాగు చేశారు. దాదాపు 45 రోజుల క్రితం పంటలను నాటారు. ఇప్పటివరకు పెద్దగా వర్షాలు పడకపోవడంతో రుద్రవరం, భానుముక్కల తదితర గ్రామాలలో పంటలను దున్ని వేశారు. మరో ఐదురోజుల నుంచి పది రోజుల్లో వర్షాలు పడకుంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురవాలని రైతులు కోరుతున్నారు

ప్రమాద నివారణకు చర్యలు

వెలుగోడు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వెలుగోడు, ఆత్మకూరు ప్రధాన రహదారిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ప్రమాదాలు జరుగకుండా ఎస్ఐ సురేశ్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. అటవీ ప్రాంతం రహదారిలో ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి పెయింట్ వేయించారు. అలాగే ప్రమాదాలను సూచించే బోర్డులు పిచ్చి మొక్కల నడుమ ఉండటం, మరికొన్ని చోట్ల ఒరిగి ఉండటం గుర్తించి, పిచ్చి మొక్కలు తొలగించి, సూచిక బోర్డులను స్వయంగా సరి చేశారు.



నల్లమలలో మార్కులు వేయిస్తున్న ఎస్ఐ

వీబీఆర్‌కు సందర్శకుల తాకిడి

వెలుగోడు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తెలుగుగంగలో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (వీబీఆర్)కు సందర్శకుల తాకిడి రోజు రోజుకు అధికమైంది. ఎగువ నుంచి వీబీఆర్‌కు వరద జలాలు భారీగా తరలి వస్తుండటంతో జలాశయం నిండుకుండలా మారింది. మరోవైపు స్పిల్‌వే, మెయిన్ కెనాల్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం గేట్లు మూత పడటం, వెలుగోడు గేట్లు తెరుచుకోవడం ఆపై ఆదివారం కావడంతో సందర్శకులతో వీబీఆర్ కిటకిటలాడుతోంది.



రిజర్వాయర్ వద్ద సందర్శకుల కోలాహలం

స్నేహితుల దినోత్సవం

నంద్యాల కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అవోపా భవన్‌లో ఆదివారం ఆర్యవైశ్య మహిళామండలి ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ వేడులకు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం చేతికి బ్యాండ్ ధరించి స్నేహితుల ప్రాముఖ్యత గురించి చర్చించుకున్నారు.



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న మహిళలు

వైభవంగా పల్లకీ ఉత్సవం

నంద్యాల కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లన్న క్షేత్రంలో ఆదివారం లోక కల్యాణం కోసం స్వామి అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో పండితులు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి పూజలు చేశారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ...

నిత్య కళారాధనలో భాగంగా విశాఖపట్నం వేదగాయత్రీ నృత్య కళాక్షేత్రం బృందం వారి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వద్ద కూచిపూడి నృత్యప్రదర్శన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో భాగంగా వినాయక కౌత్వం, తాండవం శివతాండవం, నటశకౌత్వం, భో.శంభో, మహదేవశివ లింగాష్టకం, అయుగిరినందిని, తదితర గీతాలకు శ్రీదేవి, కీర్తి, వైష్ణవి, మక్షిత, కావ్య, కీర్తిక ప్రదర్శన చేశారు.



మల్లన్న సన్నిధిలో కూచిపూడి నృత్యప్రదర్శన

మహానందిలో ఆర్‌యూ వీసీ పూజలు

మహానంది, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వెంకట బసవరావు కుటుంబ సమేతంగా ఆదివారం పూజలు చేశారు. వీరికి ఆలయం ముఖ మంటపం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరుడికి, కామేశ్వరీదేవికి అభిషేకార్చనలను భక్తిశ్రద్ధలతో జరిపారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో వేదపండితులు వీరిని ఆశీర్వదించారు. ఏఈఓ ఎర్రమల్ల మధు సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో నంద్యాల రామకృష్ణ పీజీ కళాశాల అధినేత గడ్డం రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



వీసీకి జ్ఞాపికను అందజేస్తున్న ఏఈవో

స్కానింగ్ సెంటర్‌పై కేసు నమోదు చేయాలి : బైరెడ్డి

నందికొట్కూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో లింగనిర్ధారణ చేసిన స్కానింగ్ సెంటర్‌పై కేసు నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నివాసంలో ఆయన మాట్లాడుతూ పగిడ్యాల మండలం బీరవోలు గ్రామంలో అబార్షన్ వికటించి మృతి చెందిన వాణి భర్త లోకేష్‌పై పోలీసులు కేసు నమోదు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆడపిల్లను కడుపులోనే చంపుకునే అనాగరిక సమాజంలో బతుకుతుండటం బాధాకరమన్నారు. ఆర్ఎంపీ డాక్టర్ గీతారాణిని, లింగనిర్ధారణ చేసిన స్కానింగ్ సెంటర్‌పై కూడా ఈ కేసులో నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేసు నమోదు, నివేదికలను కమిటీకి ఎంపీ బైరెడ్డి శబరి ద్వారా అందజే స్తామన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

నందికొట్కూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిందని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. కొత్త పింఛన్లు మంజూరు కాకపో వడం, విద్యుత్ చార్జీలు పెరగడం, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వంటి అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలపై భరించలేని భారాలు వేస్తోందని, భవిష్య త్తులో మరోసారి బషీరాబాద్ ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు. అనంతరం 21 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మున్సిపల్ పట్టణ కమిటీ కార్యదర్శిగా లక్ష్మీదేవి, కార్యదర్శిగా కాటిపోగుసోమన్నను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు



ఏసీబీకి చిక్కిన సీనియర్ అసిస్టెంట్ రమేష్ (ఫైల్)

ఆత్మకూరు 'రెవెన్యూ'లో

లంచావతారులు..!

(5వ పేజీ తరువాయి)

తలుపులు వేసి బేరసారాలు :

ఆర్డీవో కార్యాలయంలోని ఓ అధికారి గది తలుపులు వేసి బేరసారాలు సాగిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. అలాగే గతంలో ఆ అధికారి చాంబర్‌లో కొంత మంది సిబ్బంది పనిచేసేవారు. కానీ ప్రస్తుతం ఎవరూ అక్కడ ఎక్కడ లేకుండా స్వయంగా డీల్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేక్రమంలో తన కార్యాలయానికి వచ్చే ప్రజలు తన వద్దకు ఫోన్లు తీసుకురాకూడదని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. అందుకే ఆ అధికారి చాంబర్ తలుపులకు 'నాట్ అలోవుడ్ సెల్‌ఫోన్, సెల్‌ఫోన్లు లోపలికి తీసుకురాకూడదు' అని ఓ నోటీసు ఉంటుంది. సహజంగా అధికారుల వద్దకు జనం వెళ్లేటప్పుడు సెల్‌ఫోన్లను సైలెంట్‌లో ఉంచుకోవాల్సిన కనీస విచక్షణ అవసరం. అంతేతప్ప సెల్‌ఫోన్లు నాట్ అలోవుడ్ అని రాసి ఉండటాన్ని చూసి జనం అవాక్కవుతున్నారు.

అడ్డదారిలో ఉద్యోగం..?

ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారి అడ్డదారిలో ఉద్యోగాన్ని పొందినట్లు ఆత్మకూరులో విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే ఆ ఉద్యోగ నియామకం వివాదస్పదకరంగా ఉండటంతో దీపం ఉన్నప్పుడే ఇళ్లు చక్కదిద్దుకోవాలన్న చందాన ఆ అధికారి వసూళ్ల పర్వానికి తెరలేపి అందినకాడికి దోచుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాదు సదరు అధికారికి తన విధుల పట్ల సరైన అవగాహన లేదన్న విమర్శలు ఉన్నాయి. అలాగే కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను అర్థం చేసుకోకుండా గందరగోళంగా వ్యవహరిస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ అధికారి వ్యవహారంతో కార్యాలయ సిబ్బంది సైతం అల్లాడిపోతున్నారు.

ప్రతి ఫైలు విషయంలోనూ అంతే...

ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఆ అధికారికి డివిజన్ పరిధిలోని ఆయా మండలాల తహసీల్దార్లతోనూ సమన్వయం కొరవడినట్లు తెలుస్తోంది. ప్రతి ఫైలు విషయంలో డబ్బు లావాదేవీలను ప్రస్తావించడంతో సదరు అధికారితో తహసీల్దార్లు సయోధ్యతో ఉండటం లేదన్న విమర్శలు ఉన్నాయి. అందుకే కొన్ని అర్జీలను తహసీల్దార్లు సైతం మనకెందుకులే అన్నట్లు పక్కన పెడుతున్నట్లు తెలిసింది. దీంతో అంతిమంగా రెవెన్యూ శాఖకు సంబంధించి సమస్యలకు పరిష్కారం లభించకగా ప్రజలు ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి దాపరించింది. అవినీతి చీకట్లు అలుముకున్న ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయాన్ని ఉన్నతాధికారులు ఏవిధంగా ప్రక్షాళన చేస్తారో వేచిచూడాల్సిందే ఈ విషయంపై డీఆర్వో రామునాయక్‌ను వివరణ కోరగా తాను వీడియో కాన్ఫరెన్స్‌లో బీజీగా ఉన్నట్లు చెప్పడం గమనార్హం.

ఆలయాల అభివృద్ధికి కృషి

● గ్రూపు దేవాలయాల చైర్మన్ మారుతి కృష్ణన్

బేతంచెర్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అంజనేయస్వామి, చెన్నకేశవ, మాధవ, గట్ల నరసింహస్వాముల దేవాలయాల నూతన ధర్మకర్తల మండలి చైర్మన్ మారుతి కృష్ణన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంజనేయస్వామి దేవాలయంలో దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ రమేష్ సమక్షంలో ఈవో మద్దిలేటి ఆధ్వర్యంలో గ్రూపు దేవాలయాల నూతన ధర్మకర్తల మండలి చైర్మన్ మారుతి కృష్ణన్, ధర్మకర్తలతో ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, పోలూరు రాఘవరెడ్డి, గౌరి హుశేన్ రెడ్డి, పుల్లారెడ్డి, బుగ్గన బ్రహ్మానందరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్షం కోసం గ్రామస్థుల ప్రత్యేక పూజలు

బనగానపల్లె, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని పెద్దరాజుపాలెంలో వర్షం కోసం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిదిమంది యువకులు ఉపవాసదీక్షతో గ్రామంలోని ఆంజనేయస్వామి, బంగారమ్మస్వాములకు బిందెలతో నీళ్లపోశారు. గంగమ్మ దేవత పెద్దమ్మ తల్లికి 101 బిందెలు నీళ్ల పోసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం జుర్రేరు వాగులో గంగమ్మ తల్లిని నిలబెట్టి ప్రత్యేక పూజలు చేశారు.

చౌడేశ్వరీమాత ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీ మాత ఆలయాభివృద్ధికి కడపజిల్లా ప్రొద్దుటూరుకు చెందిన బొలిశెట్టి జయరాం, ధనలక్ష్మి వారి కుటుంబ సభ్యులు రూ.50వేలు విరాళం ఆదివారం అందించారు. ముందుగా అమ్మవారిని దర్శించు కోని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీఐ

కొలిమిగుండ్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శ్రావణమాసం సేల్‌పేరుతో సెల్ ఫోన్లో మేసేజ్ పంపి, తక్కువ ధరలంటూ మోసం చేస్తారని హెచ్చరించారు. ఏపీకే ఫైల్స్, ఎస్బీఐ యోనో తదితర మోసపూరిత యాప్స్ ఒపెన్ చేయరాదని, వాటిపై క్లిక్ చేస్తే సైబర్ మోసాలకు పాల్పడతారని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ చెప్పమని ఒత్తిడిచేస్తే 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

బేతంచెర్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు ఆదేశించారు. ఆదివారం సాయంత్రం కేజీబీవీ పాఠశాలను ఎంపీడీవో ఫజల్ రెహిమాన్, డీటీ మహేశ్వరరెడ్డి, మెడికల్ ఆఫీసర్ ప్రియాంక, డిప్యూటీ మలేరియా ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఎం ఈవో సోమశేఖర్ పరిశీలించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రాణాలు కాపాడాలి

బేతంచెర్ల కేజీబీవీ పాఠశాల హాస్టల్ విద్యార్థినుల ప్రాణాలను కాపాడాలని మండల సర్వసభ్య సమావేశంలో సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, నాయకులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఆదివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శులు ప్రదీప్, మధు ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కేజీబీవీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో, ఎంపీపీ, జడ్పీటీసీలకు అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

వీడని 'చెత్త' కష్టాలు

● ఇంటింటి చెత్త సేకరణపై పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం
● ప్రధాన రహదారిలోనే చెత్త కుప్పలు
● నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల మండలకేంద్రంలో ఇంటింటి చెత్తసేకరణపై పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో ప్రధాన రహదారులు, వాగులు, వంకలు చెత్తకుప్పలుగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీ ఖాతాలకు నేరుగా నిధులు విడుదల చేసి, పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. కానీ కిందిస్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాలు నేటికీ చెత్త కుప్పలుగానే దర్శనమిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కొలిమిగుండ్లలో పంచాయతీ అధికారులు ఇంటింటి చెత్త సేకరణ చేపట్టకపోవడంతో ఇళ్లలోని చెత్తను ఎక్కడ వేయాలో తెలియక ప్రజలు ప్రధాన రహదారుల్లోనూ, వీధుల్లోనూ, వంకల్లోనూ పడేస్తున్నారు. దీంతో పందులు, కుక్కలకు ఆవాసంగా మారుతున్నాయి.



ప్రధాన రహదారిలో పడేసిన చెత్త



శిథిలావస్థకు చేరుకున్న చెత్త సంపద కేంద్రం

అన్నీ ఉన్నా అధికారుల నిర్లక్ష్యం

కొలిమిగుండ్ల గ్రామ పంచాయతీకి సంబంధించి ఆరుగురు గ్రీన్ అంబాసిడర్లు అందుబాటులో ఉన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీకి ఒక ట్రాక్టరును కూడా మంజూరు చేసింది. దీంతోపాటు గతంలో 2014 తరువాత అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి, గ్రామ సమీపంలో చెత్త సంపద కేంద్రాన్ని సైతం నిర్మించారు. అయితే అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్న చందంగా అందుబాటులో అన్ని వ్యవస్థలు ఉన్నా చెత్త సేకరించడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామ ప్రజలు వాపోతున్నారు. సుమారు ఎనిమిదివేల జనాభా నివసిస్తున్న కొలిమిగుండ్లలో చెత్త సేకరణ చేపట్టకపోవడాన్ని ప్రజలు తీవ్రంగా తప్పుబడుతున్నారు.

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రం

రూ.లక్షలు వెచ్చించి గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్మించిన చెత్త సంపద కేంద్రం నిరుపయోగంగా మారి, శిథిలావస్థకు చేరింది. పంచాయతీకి ట్రాక్టరు అందుబాటులో ఉండి కూడా చెత్త సంపద సృష్టించడంపై అధికారులు చర్యలు చేపట్టడంలేదు. ఇప్పటికైనా అధికారులు గ్రామంలో పరిశుభ్రత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



చాగలమర్రి శ్రీనివాసనగర్ వద్ద సంచరిస్తున్న పందులు

నివాసాల మధ్య పందుల సంచారం

● రోగాల బారిన ప్రజలు ● పట్టించుకోని అధికారులు

చాగలమర్రి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో పందుల బెడద అధికమైంది. మల్లేవేముల బస్టాండు, దేవాలయాలు, మసీదులు, పాఠశాలలు, కళాశాలలు, ప్రధాన కూడళ్ల వద్ద పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీజీపీ కాలనీ, మల్లేవేముల రహదారి, కూలూరు రహదారి, చిన్నమకానం, పలు ప్రాంతాల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నా యి. బాలుర, బాలికల పాఠశాలలోకి చొరబడుతున్నాయి. పందులను గ్రామానికి దూరంగా ఉంచాలని అధికారులను కోరిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరోపక్క దోమలు అధికమై ఇబ్బందులు పడుతున్నామని, మరో పక్క పందుల వల్ల రోగాలు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పందులను గ్రామానికి దూరంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



పందుల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఎక్కడ చూసిన పందులు తిరుగు తున్నాయి. పందుల సంచారంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– అబ్దుల్ రజాక్, చాగలమర్రి

గ్రామానికి దూరంగా తరలించాలి



పందులు సంచరించకుండా ఊరికి దూరంగా తరలించాలి. రహదారుల్లో తిరగడం వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి ఇళ్ల మధ్య పందులు తిరుగకుండా చూడాలి.

– వాసు, చాగలమర్రి

దోమల బెడద

● ఫాగింగ్ చేయడంలో నిర్లక్ష్యం

డోన్ టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో దోమల బెడద రోజురోజుకూ ఎక్కువవుతోంది. దోమ కాటుతో పిల్లల నుంచి వృద్ధుల వరకు విషజ్వరాలు, వ్యాధులతో బాధపడుతున్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో జనావాసాల మధ్య మురుగు గుంతల నుంచి దోమలు అధిక సంఖ్యలో పుట్టుకు వస్తున్నాయి. చీకటి పడిందంటే చాలు.. జనంపై దండయాత్ర చేస్తున్నాయి. దోమలు నివారించడానికి సంబంధిత అధికారులు ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే పారిశుధ్య కార్మికులు మురుగు కాలువల్లో పూడిక తీసి అక్కడే పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్గంధం వెదల్లుతోందని వాపోతున్నారు. దోమల బెడద నివారణకు ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు.



డోన్ పట్టణంలో ఓ కాలనీలో నిల్వ ఉన్న మురుగు

ఇబ్బందులు పడుతున్నాం



దోమల బెడదతో సాయంత్రం ఇంటి నుంచి బయటకు రావాలంటే అవస్థ పడు తున్నాం. శానిటేషన్ సిబ్బంది ఫాగింగ్ చే యడం లేదు. మురుగు కాలువలు పూడిక తీసి చెత్తాచెదారాన్ని తొలగించాలి.

– లక్ష్మీదేవి, ఇందిరానగర్, కాలనీవాసి, డోన్

వైపీపీ హయాంలోనే కక్ష సాధింపు చర్యలు



మాట్లాడుతున్న మార్కెట్ యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో టీడీపీ నేతలపై, కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారని, అందుకే ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పారని బనగానపల్లె మార్కెట్‌యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులు టంగుటూరు శ్రీనయ్య, బురానుద్దీన్‌తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, అన్యాయంగా కట్టడాలు కూల్చి వేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేవలం మంత్రి బీసీపై బురద చల్లడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. బనగానపల్లెలో పాతబస్టాండ్‌లో అక్రమ కట్టడాలు కూల్చివేస్తే తప్పేమిటన్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రజావేదికను కూల్చివేసిన ఘనత వైసీపీదన్నారు. బీసీ రాజారెడ్డి ప్రభుత్వవైద్యశాలలో సొంత నిధులతో రోగులకు భోజనం పెడుతుంటే ఓర్వలేక ఆపివేసిన ఘనత కాటసాని రామిరెడ్డిదన్నారు. పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను గ్రామ పంచాయితీ నడపలేకపోవడంతోనే తొలగించి షాదీఖానా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోనే తొలగించినట్లు తెలిపారు. కూటమి పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భూషన్న, ఇస్మాయిల్‌ఖాన్, రాయలసీమ సలాం, పాతపాడు చిన్నస్వామి, పసుపుల బాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాజగోపుర కలశ ప్రతిష్ఠ

ఉయ్యాలవాడ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంజేడు గ్రామంలో మూడు రోజులుగా కొనసాగిన వేంకటేశ్వరస్వామి రాజగోపుర కలశ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ముగిసింది. ప్రధాన అర్చకులు క్రిష్ణశర్మ, అనంతశర్మల ఆధ్వర్యంలో ఆదివారం యంత్రాలకు అభిషేకం, సింహలగ్నం చేసి ఉదయం 11.20 గంటలకు కుంభాభిషేకం, శిఖర, ప్రాణప్రతిష్ఠ చేశారు. అనంతరం వేదమంత్రాలు, మేళతాళాల మధ్య గోపురంపై కలశాలను ప్రతిష్ఠించారు. పూర్ణాహుతి హోమంలో దంపతులు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిష్ఠను వీక్షించారు. విచ్చేసిన భక్తులకు గ్రామస్థులు అన్నదాన కార్యక్రమం చేశారు.



పూర్ణాహుతిలో పాల్గొన్న దంపతులు

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

● మండల సమావేశంలో ఎంపీపీ నాగభూషణం రెడ్డి



సమావేశంలో వాగ్వాదం చేస్తున్న సర్పంచులు

బేతంచెర్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి సర్పంచులు సహకరించాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్ నిర్వహించారు. అంబాపురం సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి కోసం మంజూరైన రూ.12.640 కోట్ల నిధులను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాయం చేశారని ఆరోపించారు. దాంతో పంచాయతీ అభివృద్ధి, కరెంటు బిల్లులు సైతం చెల్లించలేని దుస్థితిలో ఉన్నాయన్నారు. ఆయన నిధుల గురించి ప్రశ్నించగా వైసీపీ సర్పంచులు వేణుగోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, కొత్తపల్లి ఎంపీటీసీ సభ్యులు మునీశ్వర రెడ్డి వాగ్వాదానికి దిగారు. అనంతరం ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడం లేదని, గ్రామాల అభివృద్ధికి నిధులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తుందని ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్ తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు శివలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ (రీసర్వే) మహేశ్వరరెడ్డి, మండల విద్యాధికారి సోమశేఖర్, పీఆర్ ఏఈ మహేష్, ఆర్‌డబ్ల్యూఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణమాస పూజలు

చాగలమర్రి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కోదండరామాలయంలో శ్రావణమాస పూజలను వేద పండితుల ఆధ్వర్యంలో మహిళలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం సీతారాములకు జల, పాలాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల ఉత్సవ మూర్తులతో పల్లకి ఉత్సవం చేశారు. గంగాభవాని ఆలయంలో గంగమ్మకు పండ్లు, పూలతో అలంకరింప చేసి పూజలు చేశారు. పెద్దమ్మ, చాగలమ్మ ఆలయాల్లో మహిళలు సామూహిక వడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. శెట్టివీడు గ్రామ రహదారిలోగల అభయాంజనేయస్వామికి ప్రొద్దుటూరుకు చెందిన శ్రీకృష్ణ ఆలయ కమిటీ చైర్మన్ బాల సుబ్బరాయుడు, వైస్ చైర్మన్ బాలపుల్లయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి చీర, సారె, గాజులు తీసుకెళ్లి ప్రత్యేక అలంకరణ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు తలారీ శ్రీను, శంకరయ్య, చిన్న పెద్దన్న, చిన్నన్న తదితరులున్నారు.

12వ పీఆర్సీ కమిటీని నియమించాలి

చాగలమర్రి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయుల 12వ పీఆర్సీ కమిటీని నియమించాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలను విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్ కోరారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యలను పరిష్కరించి విద్యాశాఖలో ఉన్న అసంబద్ధతను తొలగించాలని అన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు మస్తాన్‌బాష, కార్యదర్శి సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి మాబుహుసేన్, ఎస్టీయూ సంఘ నాయకులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

డోన్ టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కోడుమూరులో 7న ఉదయం 12 గంటలకు రాష్ట్ర కుర్ణి (నేసె) సంక్షేమ సంఘం ప్రథమ మహాసభ నిర్వహించనున్నట్లు డోన్ కుర్ణి సంఘం అధ్యక్షుడు హరిప్రసాద్ బాబు తెలిపారు. ఆదివారం పట్టణంలోని స్థానిక కార్యాలయంలో కుర్ణి సంఘం మహాసభ వాల్‌పోస్టర్లను సభ్యులు శ్రీనివాసులు, కర్నూలు జిల్లా సంఘం కార్యదర్శి గోట్ల రుసేంద్ర, సహాయ కార్యదర్శి సీబీ చంద్రశేఖర్, కుర్ణి సంఘం జిల్లా కోశాధికారి కామార్తి హనుమంతప్పతో కలిసి ఆయన విడుదల చేశారు. మహాసభకు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుర్ణి సంఘం నాయకులు పాల్గొన్నారు.

దేవుడిచ్చిన వరం స్నేహం

డోన్ రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల తర్వాత దేవుడిచ్చిన గొప్ప వరం స్నేహితులే అని పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కేఎస్ భానుసింగ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం నాయకులు గాలయ్య, నరసింహులు, జి.గోపాల్, సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు, దాసప్ప, రామకృష్ణారెడ్డి, చెన్నకేశవులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయతగా పలకరించుకున్నారు కార్యక్రమంలో నరసింహ, రంగనాథ్, రాజారావు, నజీర్‌హుసేన్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమ పథకాలు సాధ్యం

చాగలమర్రి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు సాధ్యమని టీడీపీ నాయకుడు, హమాలియూనియన్ అధ్యక్షుడు గుత్తి నరసింహులు అన్నారు. ఆదివారం చాగలమర్రి గ్రామంలో ఏడాది సుపరిపాలనలో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు నాగూర్‌వలి, మహబూబ్‌బాష, భాస్కర్, మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపులు సులభతరం

చాగలమర్రి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల చెల్లింపులు ప్రస్తుతం సులభతరమైందని, క్యూఆర్‌కోడ్ స్కానర్ ద్వారా బిల్లులు చెల్లించే వెసులుబాటును ఏపీఎస్‌పీడీసీఎల్ సంస్థ కల్పించిందని విద్యుత్ శాఖ ఏఈ రమణయ్య తెలిపారు. పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద లబ్ధిదారులకు రూ.78 వేలు సబ్సిడీ ఇస్తుందని అన్నారు.

సౌకర్యాల కల్పనకు కృషి

కోవెలకుంట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల రైల్వేస్టేషనులో కనీస సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తానని దక్షిణ మధ్య రైల్వేజోన్ వినియోగదారుల కన్సల్టెంటు మెంబరు వెంకటరంగయ్య అన్నారు. ఆదివారం కోవెలకుంట్ల రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మాస్టరు పంకజ్ కుమార్‌తో సమావేశమయ్యారు. ప్రయాణికులతో మాట్లాడి తెలుసుకున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. కోవెలకుంట్లలో గుంటూరు - తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు ఆగేందుకు కృషి చేసిన ఎంపీ బైరెడ్డి శబరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేషనల్ అడ్వకేట్స్ కాన్ఫరెన్స్‌లో మద్దిలేటి

డోన్ రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఏఐసీసీ లా డిపార్టుమెంట్ నిర్వహించిన నేషనల్ అడ్వకేట్ కాన్ఫరెన్స్‌కు నంద్యాల జిల్లా నుంచి డోన్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గార్లపాటి మద్దిలేటి ఆదివారం హాజరయ్యారు. ప్రజాస్వామ్యం- రాజ్యాంగ విలువలకు ఎదురవుతున్న ప్రమాదాలపై చర్చించారు. కాన్ఫరెన్స్‌లో పాల్గొనే అవకాశం కల్పించిన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, నంద్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్‌కు గార్లపాటి మద్దిలేటి కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

ఆళ్లగడ్డ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అహోబిలం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వీరభద్రుడు ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ ఆళ్లగడ్డ నాయకుడు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి గ్రామానికి చెరుకొని వీరభద్రుడి మృత దేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

డోన్ టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అర్బన్ ఎస్ఐ జగన్నాథం నాయక్, పీఎస్ఐ రవిప్రకాష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కంబలపాడు సర్కిల్‌లో వాహనాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది కృష్ణ యాదవ్, రామ్మోహన్, నాగరాజు, రాజు, నాగరాజు, రామాంజనేయులు ఉన్నారు.

రుద్రవరం: మద్యం తాగి వాహనాలు నడపరాదని ఎస్ఐ మహ్మద్‌రఫి అన్నారు. ఆదివారం సాయంత్రం రుద్రవరం సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలు డ్రైవింగ్ చేసే వారు లైసెన్సులు తప్పకుండా ఉండాలన్నారు.

జూదరుల అరెస్టు

కొలిమిగుండ్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామ సమీపంలోని గరుగుల వద్ద పేకాట స్థావరంపై దాడులు నిర్వహించామని సీఐ రమేష్‌బాబు వెల్లడించారు. నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని రూ.5,100 నగదు, కొన్ని పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

అవుకు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పోలీస్ స్టేషన్ వద్ద రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి ఆదివారం తెలిపారు. సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికలపై నిత్యం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

శిరివెళ్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీటీసీ-2 కమతం జయరామిరెడ్డి అన్నారు. ఆదివారం యర్రగుంట్ల గ్రామంలో టీడీపీ కార్యాలయంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి రైతులు, టీడీపీ నాయకులు ధాన్యాభిషేకం చేశారు. కార్యక్రమంలో కమతం సుబ్బా రెడ్డి, శీలం రామ్మోహన్, తపసి శ్రీరాములు, జాకీర్ పాల్గొన్నారు.